సాక్షి
శ్రీకాకుళం

మంగళవారం । 14 । మార్చి । 2023



పొల్లు తీసే ముల్లు దొరక్క..

ఖాదీకి అంత మెరుపు ఎలా సాధ్యమైంది..? వాలుగ చేపకు దానికి సంబంధమేమిటి..? ఇప్పుడు పరిస్థితిపై కథనం. - 8లో



హాస్టల్ విద్యార్థులకు అస్వస్థత

పొలవరం జీసీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. 39 మందికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. - 8లో

15న వినియోగదారుల హక్కుల దినోత్సవం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న జిల్లా స్థాయి వేడుకలు జరగనున్నట్లు సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ వేడుకలు నిర్వహిస్తామన్నారు.

న్యూస్‌రీల్

వెబ్‌కాస్టింగ్ పరిశీలన



వెబ్ కాస్టింగ్‌ను పరిశీలిస్తున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పరిశీలించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని సోమవారం ఆయన పరిశీలించారు. ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ పై పలు సూచనలు అందించారు.

ఓటుకు దూరంగా ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్

పలాస: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇచ్ఛాపురం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే బెందాళం అశోక్ తన ఓటు హక్కును వినియోగించుకోలేదు. ఇచ్ఛాపురంలో ఉన్నప్పటికీ పలాస పోలింగ్ కేంద్రం వద్దకు ఆయన సోమవారం రాలేదు. ఆయనతో పాటు ఇచ్ఛాపురానికి చెందిన ఒక ఎంపీటీసీ, ఒక మున్సిపల్ కౌన్సిలర్ కూడా ఓటు వేయలేదు.

రీజనల్ డైరెక్టర్‌గా శ్రీకాకుళం నగరపాలక కమిషనర్ ఓబులేష్



ఓబులేష్‌ను అభినందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం, శ్రీకాకుళం పీఎన్ కాలనీ: శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేష్‌కు రీజనల్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. సెలెక్షన్ గ్రేడ్ కమిషనర్‌గా ఉన్న ఆయనకు రీజనల్ డైరెక్టర్ కమ్ అప్పిలేట్ కమిషనర్‌గా పదోన్నతి రావటంతో సోమవారం లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఓబులేష్‌ను ఆయన చాంబర్‌లో కలసి అభినందించారు. లయన్స్‌క్లబ్ ఇంటర్‌నేషనల్ శ్రీకాకుళం అధ్యక్షుడు హారిక ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెంట్రల్ శ్రీకాకుళం కార్యదర్శి ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు పొన్నాడ రవికుమార్, జీబీ గాంధీ, బ్రహ్మాజీ, నటుకుల మోహన్, బాడాన దేవభూషణరావు, తాలాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

20న తపాలా అదాలత్

శ్రీకాకుళం అర్బన్: విశాఖపట్నం పోస్టల్ రీజియన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించేందుకు ఈనెల 20వ తేదీన 109వ తపాలా అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయ సహాయ సంచాలకులు డబ్ల్యూ నాగాదిత్యకుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖపట్నం పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయం ఆధ్వర్యంలో మార్చి 20వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు 109వ తపాలా అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. తపాలా సర్వీసులకు చెందిన ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు ఈ అదాలత్‌లో చర్చిస్తామన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో గల తపాలా వినియోగదారులు తమ ఫిర్యాదులను ఈ నెల 16లోగా 109వ తపాలా అదాలత్ అను శీర్షికతో డబ్ల్యూ.నాగాదిత్య కుమార్, అసిస్టెంట్ డైరక్టర్, పోస్ట్ మాస్టర్ జనరల్ వారి కార్యాలయం, విశాఖపట్నం 530 017 చిరునామాకు పంపాలని కోరారు.

రిమ్స్‌లో తొలిసారి కీలు మార్పిడి ఆపరేషన్



శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యుల బృందం

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో ఓ రోగికి మోకాలు కీలు శస్త్ర చికిత్స విజయవంతంగా చేశారు. ఇలాంటి ఆపరేషన్ రిమ్స్‌లో చేయడం ఇదే మొదటిసారి. విజయనగరం జిల్లా గంట్యాడ మండలం కొత్త వెలగవాడకు చెందిన కానూరి సత్యవతి కొద్దిరోజుల కిందట విపరీతమైన కీళ్ల నొప్పులతో ఆస్పత్రిలో చేరారు. 61 ఏళ్ల ఉన్న ఈమెకు పరీక్షలు జరిపి మోకాలి కీళ్లు అరిగిపోయినట్లు గుర్తించారు. శస్త్ర చికిత్స ద్వారా కీళ్ల మార్పిడి జరపాలని నిర్ణయించి సోమవారం ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్థోపెడిక్ సర్జన్ లుకలాపు ప్రసన్నకుమార్ తెలిపారు. ఈ శస్త్ర చికిత్సలో డాక్టర్ వి.ధర్మారావు, డాక్టర్ కె.శ్రీనివాసరావు, పి. శ్రీనివాసరావు, డాక్టర్ వంశీ, డాక్టర్ అబ్దుల్, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ సుబ్బలక్ష్మి, డాక్టర్ వాసుదేవరావు, డాక్టర్ రేష్మానాయుడు, డాక్టర్ జానకి, డాక్టర్ భార్గవి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి **96.91%**

పట్టభద్రుల సీటుకు **71.60 %**

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

ఆరంభం మెల్లగా.. ముగింపు భారీగా

శ్రీకాకుళం బాలికల హైస్కూల్‌లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు క్యూలో వేచి ఉన్న పట్టభద్రులు



శ్రీకాకుళంలో ఓటు హక్కును వినియోగించుకుంటున్న మహిళా ప్రజాప్రతినిధి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. టీడీపీ నాయకులు అక్కడక్కడ సృష్టించిన గలాటా తప్ప అంతకుమించి ఎటువంటి ఘటనలూ చోటు చేసుకోలేదు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోలింగ్‌లో 96.91శాతం, పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్‌లో 71.60 శాతం ఓటింగ్ నమోదైంది. పోలింగ్ తొలుత మందకొడిగా సాగినా మధ్యాహ్నం 12గంటల తర్వాత ఊపందుకుంది. ఓటర్ల తాకిడితో పొద్దు పోయే వరకు పోలింగ్ సాగింది.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఉదయం 8గంటలకే ప్రారంభమైంది. కానీ ఓటర్లు ఉదయమే పోలింగ్ కేంద్రాలకు వెళ్లడానికి ఆసక్తి చూపలేదు. ఉదయం 10గంటలయ్యే సరికి పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి కేవలం 10.48 శాతం ఓటింగ్ మాత్రమే జరిగింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి సంబంధించి 14.69 శాతం ఓటింగ్ నమోదైంది. ఆ తర్వాత నెమ్మదిగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రావడం ప్రారంభించారు. మధ్యాహ్నం 12గంటల కల్లా పట్టభద్రులకు సంబంధించి 19.8శాతం, స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి సంబంధించి 69.45శాతం పోలింగ్ జరిగింది. మధ్యాహ్నం 12గంటల తర్వాత ఓటింగ్ ఊపందుకుంది. ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ఎండలను సైతం లెక్క చేయకుండా బారులు తీరారు. దీంతో మధ్యాహ్నం 2గంటలయ్యే సరికి పట్టభద్రుల ఓటింగ్ ఒక్కసారిగా 41.07శాతంకు పెరిగింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి సంబంధించి 90.59 శాతం నమోదైంది. అదే ఊపుతో పోలింగ్ సాగడంతో సాయంత్రం 4 గంటల కల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి 60.73 శాతం, స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి సంబంధించి 96.91శాతం ఓటింగ్ జరిగింది. వాస్తవంగా సాయంత్రం 4గంటలకు పోలింగ్ ముగియాల్సి ఉండగా అప్పటికే భారీ సంఖ్యలో ఓటర్లు క్యూలైన్లలో ఉండటంతో ముగింపు సమయానికి వచ్చిన వారందరికీ ఓటు వేసుకునే అవకాశం కల్పించారు. దీంతో పొద్దు పోయే వరకు పోలింగ్ జరిగింది. చివరికి పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి ఓటింగ్ 71.60శాతం ఓటింగ్ నమోదైంది. ఎన్నికలు ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బీ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డీఆర్ఓ రాజేశ్వరీ, ఆర్డీఓ బి.శాంతి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచి సీల్ వేశారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ	
మొత్తం ఓట్లు	776
మహిళా ఓట్లు	466
పురుషుల ఓట్లు	310
ఓటు వేసిన సభ్యులు	752
ఓటేసిన మహిళా సభ్యులు	449
ఓటేసిన పురుషులు	303
నమోదైన ఓటింగ్ శాతం	96.91

పట్టభద్రుల ఎమ్మెల్సీ	
మొత్తం ఓట్లు	52,256
పురుషుల ఓట్లు	36,412
మహిళా ఓట్లు	15,839
ఇతరులు	5
పలాస డివిజన్‌లో ఓట్లు	11,522
శ్రీకాకుళం డివిజన్‌లో ఓట్లు	29,631
టెక్కలి డివిజన్‌లో ఓట్లు	11,103
మొత్తం ఓట్లు వేసిన వారి సంఖ్య	37,417
ఓట్లేసిన పురుషులు	25,883
ఓట్లేసిన మహిళలు	11,534
పలాస డివిజన్‌లో పోలైన ఓట్లు	8560(74.29శాతం)
శ్రీకాకుళం డివిజన్‌లో పోలైన ఓట్లు	20,788(70.16శాతం)
టెక్కలి డివిజన్‌లో పోలైన ఓట్లు	8069(72.67శాతం)

జిల్లా వ్యాప్తంగా నమోదైన ఓటింగ్ శాతం : 71.60



వజ్రపుకొత్తూరు: మొదటిసారి ఓటేసిన గ్రాడ్యుయేట్లు



వజ్రపుకొత్తూరు: గ్రాడ్యుయేట్ ఓటు వేసేందుకు వచ్చిన దివ్యాంగుడు



ఎచ్చెర్ల క్యాంపస్: గ్రాడ్యుయేట్ ఓటు వేసేందుకు వచ్చిన నూతన వధూవరులు



టీపీఎం స్కూల్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం సిరా మార్కు చూపిస్తున్న కలెక్టర్ దంపతులు

టీడీపీ నాయకుల హల్‌చల్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు కింతలి ధరణి సాయంత్రం 3.58 గంటలకు సంతబొమ్మాళి పోలింగ్ కేంద్రానికి వచ్చారు. పోలింగ్ ముగియడానికి 2 నిమిషాలు సమయం ఉండడంతో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రంలోకి ఆమెను అధికారులు పంపించారు. దీనిపై టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేసి అధికారులతో వాగ్వాదానికి దిగారు. అక్కడ ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంకా రెండు నిమిషాలు గడువు ఉండడంతో నిబంధనల ప్రకారం అధికారులు వ్యవహరించారని చెప్పారు. దీంతో టీడీపీ నాయకులు రెచ్చిపోయి ఈ ఊరు మాది, మా ఊరు వస్తే ఏమైనా చేస్తామని హెచ్చరించడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగి తోపులాటకు దారితీసింది. పోలీసులు ఇరువర్గాలను కట్టడి చేశారు. అనంతరం విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకొని వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడారు. దౌర్జన్యం చేసిన టీడీపీ నాయకులను అరెస్టు చేసేంతవరకు ఇక్కడి నుంచి కదిలేదిలేదంటూ సంతబొమ్మాళి పోలీస్ స్టేషన్ ముందు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బైఠాయించారు. ఇచ్ఛాపురం పోలింగ్ స్టేషన్ వద్ద బీజేపీ నాయకురాలు నిర్మలాదేవి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఇతర పార్టీల నాయకులు పోలింగ్ స్టేషన్‌లో ఉన్నారని, తమకూ అనుమతి ఇవ్వాలని వాగ్వాదం చేశారు. పోలీసులు నచ్చ చెప్పి అక్కడి నుంచి పంపించేశారు. పలాసలో కూడా స్వల్ప ఘర్షణలు జరిగాయి.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



శ్రీకాకుళం ఆర్డీఓ ఆఫీసులోని పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించిన పౌరసరఫరాల కమిషనర్ అరుణకుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పలు పోలింగ్ కేంద్రాలను రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకుడు, పౌర సరఫరాల కమిషనర్ హనుమంతు అరుణ్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఓటింగ్ తీరును ఆయన తెలుసుకున్నారు. శ్రీకాకుళం రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో జరిగిన పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ శ్రీకాకుళం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న స్థానిక సంస్థల పోలింగ్ బూత్‌ను పరిశీలించారు.

2017లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ శాతం 72.70

పోలింగ్ సరళి

పట్టభద్రులు

డివిజన్	ఉదయం 10	మధ్యాహ్నం 12	మధ్యాహ్నం 2	సాయంత్రం 4	పోలింగ్ ముగింపు
పలాస	1185	2375	4687	7447	8560
శ్రీకాకుళం	3162	5617	11939	18178	20788
టెక్కలి	1117	2348	4836	6112	8069
	5464	10,340	21,462	31,737	37,417

స్థానిక సంస్థలు

మొత్తం ఓట్లు	ఉదయం 10	మధ్యాహ్నం 12	మధ్యాహ్నం 2	సాయంత్రం 4
776	114	539	703	752



పలాస 4వ పోలింగ్ కేంద్రంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు, జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ తదితరులు

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద ఓటింగ్ జరుగుతున్న తీరు, నిర్వహణను ఎస్పీ జీఆర్ రాధిక పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద నియమించిన పోలీస్ బందోబస్తును సమీక్షించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించి ఎన్నికల నియమావళి ప్రకారం విధులు నిర్వహించేలా చేశారు. ఓటర్లను తమ ఓట్లు ప్రశాంత వాతావరణంలో వేసేలా చర్యలు తీసుకున్నారు.



పర్యవేక్షిస్తున్న ఎస్పీ రాధిక

స్ట్రాంగ్‌రూమ్‌లోకి బ్యాలెట్ బాక్సులు



స్ట్రాంగ్ రూముల్లో భద్ర పర్చిన బ్యాలెట్ బాక్సులు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని స్థానిక సంస్థల, పట్టభద్రుల నియోజక వర్గాల ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లకు బ్యాలెట్ బాక్సులు భద్రంగా తరలించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ఈ నెల 16న నిర్వహించనున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బ్యాలెట్లను విశాఖ తరలిస్తారు. అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూముల్లో బ్యాలెట్ బాక్సులు భద్రపరిచి, వీడియో ఆధారంగా సీల్ చేశారు. కలెక్టర్, ఎన్నికల అధికారి శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ ఎం.నవీన్, ఆర్డీఓ బి. శాంతి పర్యవేక్షించారు.




స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోలింగ్‌లో ఓటు వేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి ధర్మాన ప్రసాదరావు



పట్టభద్రుల ఓటు వేశాక మంత్రి సీదిరి అప్పలరాజు దంపతులు



పోలాకి: పట్టభద్రుల ఓటు వేసిన ఎమ్మెల్యే కృష్ణదాస్ దంపతులు



టెక్కలి: స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి ఓటు వేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



శ్రీకాకుళంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి ఓటేస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్



టెక్కలి: పట్టభద్రుల ఓటేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



సోంపేట: గ్రాడ్యుయేట్ ఓటేసిన పిరియా సాయిరాజ్

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ


- ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి
- 109 కేంద్రాల్లో పరీక్ష రాయనున్న 57,122 మంది విద్యార్థులు
- సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. బుధవారం నుంచి మొదలు కానున్న పరీక్షలకు ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. తెలుగు/సంస్కృతం/హిందీ పేపర్లతో పరీక్షలు మొదలుకానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా డీవీఈఓ కోట ప్రకాశరావు సమన్వయంతో ఆర్‌ఐఓ ఎస్.తవిటినాయుడు నేతృత్వంలో డీఈసీ కమిటీ పక్కాగా ఏర్పాట్లు చేసింది. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షలు సాఫీగా రాసేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ..

ఇంటర్ పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం జరగనున్నాయి. 8.30 నుంచి పరీక్ష కేంద్రంలోపలికి అనుమతిస్తారు. 9 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతించబోమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. పరీక్ష కేంద్రాలకు అర్ధగంట ముందుగా చేరుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచిస్తున్నారు.

109 కేంద్రాలు.. 57,122 మంది విద్యార్థులు



ఇంటర్మీడియెట్ విద్యార్థులు

జిల్లాలో ఇంటర్ పరీక్షలకు రికార్డు స్థాయిలో 109 కేంద్రాలను కేటాయించారు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 42, మోడల్ స్కూల్/కాలేజీలు 03, సోషల్ వెల్ఫేర్ 07, ట్రైబల్ వెల్ఫేర్ 02, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 55 ఉన్నాయి. ఇంటర్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 57,122 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం 29,589 మంది, ద్వితీయ సంవత్సరం 27,533 ఉన్నారు. పరీక్ష నిర్వహణకు గాను కలెక్టర్ అధ్యక్షతన ఒక హైపవర్ కమిటీ సభ్యులు, 109 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 109 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, కస్టోడియన్లను నియమించారు. సిట్టింగ్ స్క్వాడ్‌లు 5, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 5, జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించిన 17 కళాశాలల్లో ప్రత్యేక సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమిస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిఘాతోపాటు వాటిని ఇంటర్ బోర్డు, జిల్లా ఆర్‌ఐఓ కార్యాలయానికి స్ట్రీమింగ్ ద్వారా అనుసంధానం చేశారు.



పక్కాగా ఏర్పాట్లు



ఇంటర్ పరీక్షలను పక్కాగా, పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించించింది. కలెక్టర్ సూచనల నేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా భావించి ఏర్పాట్లు చేశాం. అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. – కోట ప్రకాశరావు, ఇంటర్మీడియెట్ విద్య జిల్లా డీవీఈఓ

హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు..

ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల సౌకర్యార్థం జిల్లా ఆర్‌ఐఓ కార్యాలయంలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు తమ సమస్యలు, సందేహాల నివృత్తి కోసం ఓ ప్రిన్సిపాల్ స్థాయి అధికారిని, సిబ్బందిని కంట్రోల్ రూమ్‌లో నియమించారు. ల్యాండ్‌లైన్ 08942 295933, సెల్ నంబర్ 8639313490 ను సంప్రదించవచ్చని జిల్లా ఆర్‌ఐఓ ఎస్.తవిటినాయుడు సూచిస్తున్నారు.

నేడు డీవార్మింగ్ డే

- జిల్లాలో 4.40 లక్షల మందికి నులి పురుగుల మందుల పంపిణీ
- 18న మాపప్ డ్రైవ్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

అరసవల్లి: జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో (ఆర్‌బీఎస్‌కె) భాగంగా జిల్లా వ్యాప్తంగా నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను 1–19 ఏళ్ల వయస్సు గల విద్యార్థులందరికీ మంగళవారం అందజేయనున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి ప్రకటించారు. ఈ మేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు లక్ష్యం మేరకు విద్యార్థులందరికీ నులిపురుగుల మాత్రలు అందేలా చర్యలు చేపడుతున్నట్లుగా ఆమె తెలియజేశారు. జిల్లాలో మొత్తం 4,40,908 మంది (1–19 వయస్సు) విద్యార్థుల కోసం 6.44 లక్షల ఆల్బెండజోల్ మాత్రలు సిద్ధం చేశామని, వీటిని జిల్లాలో ఉన్న 11,214 విద్యాసంస్థలకు సరఫరా చేశామని వివరించారు. ప్రతి 20–25 పాఠశాలలకు ఒక మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షకుడిగా ఉంటారని, అలాగే మధ్యాహ్నం భోజనం అనంతరం ఈ మాత్రలను మింగించిన తర్వాత వైద్యారోగ్య శాఖ సిబ్బంది ప్రతి విద్యాసంస్థ వద్ద కనీసం అరగంటకు పైగా సమయాన్ని విద్యార్థుల వద్దనే గడపాలని ఆదేశిస్తున్నట్లుగా వివరించారు. మంగళవారం మాత్రలు వేసుకోని వారి కోసం 18న మాపప్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, దీంతో మొత్తం లక్ష్యం పూర్తవుతుందని చెప్పారు. కార్యక్రమం విజయవంతం చేయడానికి అంతా సహకరించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 1 నుంచి 2 ఏళ్ల చిన్నారులకు ఆల్బెండజోల్ అర ముక్క మాత్రను డోస్‌గా నమిలి తినిపించాలని, 2 నుంచి 19 ఏళ్ల లోపు ఉన్న వారికి ఒక పుల్ మాత్ర చొప్పున మధ్యాహ్నం భోజనం తర్వాత నమిలేలా చేయాలని చెప్పారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ విజేత కృష్ణా జిల్లా

కవిటి: మండలంలోని ఆర్.బైరిపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆహ్వానిత వాలీబాల్ టోర్నీ విజేతగా కృష్ణా జిల్లా జట్టు నిలిచింది. ఆదివారం అర్ధరాత్రి వరకు పోటీలు జరిగాయి. ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాలు వరుసగా విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జట్లు కైవసం చేసుకున్నాయి. విజేతలకు షీల్డ్‌లతో పాటు నగదు బహుమతులు అందించారు.

క్లుప్తంగా

సంగీత, నృత్య వార్షిక పరీక్షలకు నోటిఫికేషన్

శ్రీకాకుళం కల్చరల్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం(హైదరాబాద్) నిర్వహించే సంగీత, నృత్య వార్షిక పరీక్షల సర్టిఫికెట్, డిప్లమో కోర్సులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు విజయనగరం ప్రభుత్వ మహారాజా సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 విద్యాసంవత్సరంలో వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులులు దరఖాస్తు ఫారాలను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని డీడీ ద్వారా నిర్ణీత రుసుం చెల్లించాలన్నారు. జాతీయ బ్యాంకు నుంచి రిజిస్ట్రార్, పి.ఎస్.తెలుగు యూనివర్సిటీ, హైదరాబాద్ పేరిట డీడీ తీయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మార్చి 9 నుంచి ఏప్రిల్ 14 వరకు సాధారణ రుసుంతో, 24 వరకు అపరాధ రుసుంతో చెల్లించవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఏప్రిల్ 29 సాయంత్రం 5గంటల్లోగా విశ్వవిద్యాలయానికి అందించాలని సూచించారు.

సౌత్‌జోన్ పోటీల్లో హర్షిత ప్రతిభ



ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ మహిళా కళాశాలకు చెందిన సీఎంఈ డిప్లమో మొదటి ఏడాది విద్యార్థిని కె.హర్షిత ఆల్ ఇండియా సౌత్‌జోన్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్సుమీట్‌లో సత్తాచాటారు. ఈ నెల 11, 12 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన ఈ పోటీల్లో టేబుల్ టెన్నిస్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచింది. కళాశాల ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి, అధ్యాపకులు హర్షితను అభినందించారు.

కురుక్షేత్రకు యూత్ రెడ్‌క్రాస్



విద్యార్థులకు వీడ్కోలు పలుకుతున్న రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు

శ్రీకాకుళం కల్చరల్: అంతర్జాతీయ యూత్ రెడ్‌క్రాస్ కార్యక్రమంలో భాగంగా హర్యానా రాష్ట్రం కురుక్షేత్రలో జరిగే జాతీయ సమైక్యతా ఉత్సవాల్లో పాల్గొనేందుకు జిల్లా రెడ్‌క్రాస్ తరపున ఐదుగురు సభ్యుల బృందం వెళుతున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు. జిల్లా నుంచి కాకినాడ ఆదిత్య డిగ్రీ కాలేజ్, శివానీ ఫార్మసీ కాలేజ్‌కు చెందిన యూత్ రెడ్‌క్రాస్ విద్యార్థులు బయలుదేరి వెళుతున్నారని చెప్పారు. ఈ నెల 16 నుంచి 21 వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే యూత్ రెడ్‌క్రాస్ విద్యార్థులతో కలిసి వారి ఆచార, వ్యవహారాలు, సంప్రదాయాలను అధ్యయనం చేస్తారని వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

ముల్లు.. అది గులాబీ ముల్లైనా, పిచ్చి పొదల్లో ముల్లైనా.. చివరికి చేప ముల్లైనా గుచ్చుకుంటుందని భయపడతాం. గులాబీని వాడేటప్పుడు, చేపలు తినేటప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తాం. కానీ పొందూరు ఖాదీ నేతకార్మికులు ఆ ముల్లు లభించక తల్లడిల్లుతున్నారు. వారికి అవసరమైన కృత్రిమ ముళ్ల తయారీకి అనేకమంది ప్రయత్నిస్తున్నారు. అధ్యయనాలు, పరిశోధనలు చేస్తున్నారు. అస్ఫాల్ ఒక ముల్లు కోసం ఇన్ని మల్లగుల్లాలా! ఏమిటి దాని గొప్ప? అని వెటకారం చేయకండి.. చిన్న చూపు చూడకండి. ఎందుకంటే ఆ ముల్లు లేనిదే ఖాదీ దారం తయారు కాదు. ఖాదీ వస్త్రాలు ఆ నునుపు, మెరుపు సంతరించుకోలేవు మరి! అలాగని అన్ని చేపల ముళ్లు పనికిరావు. ఖాదీ వస్త్రాల తయారీకి ఉపయోగపడే ముడి కొండపత్తిలోని పొల్లు తీసి శుభ్రం చేసేందుకు వాలుగ చేప ముల్లు మాత్రమే ఉపయోగపడుతుంది. ఆ చేప దవడ పలువరుసతో ఉండే ప్రత్యేకమైన ముల్లు లభించక దాని ప్రభావం ఖాదీ నేతపై పడుతోంది. అందుకే వాలుగ చేప ముల్లును పోలి ఉండేలా కృత్రిమ పరికరం తయారీకి ఒక సీనియర్ సైంటిస్ట్, ఒక యువజన సంఘం, ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తున్నాయి.



పత్తిని శుభ్రం చేసేందుకు వినియోగించే వాలుగ చేప దవడ భాగాలు


• పొల్లు తీసే ముల్లు

దొరక్క తల్లడిల్లు!



వాలుగ చేప ముల్లుతో పత్తిని శుభ్రం చేస్తూ..

- వాలుగ చేప దవడ భాగాలతో తయారీ
- దాంతోనే ఖాదీకి నునుపు, మెరుపు
- మత్స్యరాజం సేకరణ కష్టమవుతోన్న వైనం
- కృత్రిమ ముళ్ల తయారీకి శాస్త్రవేత్తల ప్రయత్నాలు



వాలుగ చేప



శ్రీకాకుళం డెస్క్:

పొందూరు ఖాదీ తయారీలో కీలకమైన.. పత్తిని శుభ్రం చేసేందుకు వినియోగించే.. వాలుగ చేప దవడ భాగం అవసరానికి తగినంతగా లభ్యం కావడం లేదా? ఆ చేప ముల్లును సేకరించడం కష్టతరంగా మారిందా..? ఆ ముల్లుకు ప్రత్యామ్నాయాలను రూపొందించే పనిలో సీనియర్ శాస్త్రవేత్తలు దృష్టిపెట్టారా..? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి.

ఏమిటీ వాలుగ.. ఎందుకీ వెలుగు..

వాలుగు చేప.. శాస్త్రీయ నామం వల్లగో అట్టు. మంచినీటిలో పెరిగే చేప. మిగతా చేపల మాదిరిగా కాకుండా దవడ భాగం విభిన్నంగా ఉంటుంది. దవడలోని ఉండే మృదువైన పళ్లవరసే ఖాదీ వస్త్రం రూపొందించడంలో కీలకం. ఖాదీకి అంత తెలుపు రంగు తీసుకురావడంలో కూడా కీలక పాత్ర దీనిదే.

వినియోగం ఎలా..

వాలుగ చేప దవడ భాగాన్ని మత్స్యకారుల నుంచి సేకరిస్తారు. పైదవడను రెండు ముక్కలుగా, కింది దవడను రెండు ముక్కలుగా చేస్తారు. ఆ ముక్కను ఓ చిన్న కర్రకు దువ్వెన మాదిరిగా కడతారు. దాని సాయంతో పత్తిని శుభ్ర పరుస్తారు. ఈ క్రమంలో పత్తి మృదువుగా తయారవడంతో పాటు మరింత తెలుపుగా మారుతుంది. ఎడమ చేతి వాటం ఉన్న నేత కారులు ఎడమ దవడను, కుడి చేతి వాటం ఉన్న వారు కుడి దవడను వినియోగించి పత్తిని శుభ్రపరిచేందుకు వినియోగించడం మరో విశేషం.


గతంలో రాజమండ్రి నుంచి..

తొలినాళ్లలో రాజమండ్రి ధవళేశ్వరం నుంచి కరకు సత్యమ్మ అనే మహిళ పొందూరు ఖాదీ కార్యాలయానికి వాలుగ చేప దవడల్ని సరఫరా చేసేవారు. ఆమె అనంతరం అక్కడ్నుంచి ముల్లు రావడం లేదు. శ్రీకాకుళం, విజయనగరం పరిసరాల్లోని మత్స్యకారులు అడపాదడపా తెచ్చి విక్రయిస్తున్నారు.

ప్రత్యామ్నాయాల రూపకల్పనలో..



శాస్త్రవేత్త మహేష్ కుమార్ తయారు చేసిన కృత్రిమ పరికరం



- ఖాదీ తయారీలో వాలుగ చేప దవడ కీలకం కావడం.. అవసరమైన మేర లభ్యత లేకపోవడంతో ప్రత్యామ్నాయాలపై సీనియర్ శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. మహారాష్ట్ర వార్ధాలోని మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రూరల్ ఇండస్ట్రియలైజేషన్(ఎంజీఐఆర్ఐ) సంస్థకు చెందిన సీనియర్ శాస్త్రవేత్త మహేష్‌కుమార్ ఆధ్వర్యంలోని ఓ బృందం స్టీల్‌తో వాలుగ చేప దవడ మాదిరిగా ఓ పరికరాన్ని రూపొందించింది. దీనిని హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎంఈ సంస్థ తయారు చేసింది. ఆ పరికరం పనితీరును పొందూరు ఖాదీ తయారీలో ప్రయోగాత్మకంగా పరిశీలించింది. కానీ వాలుగ చేప దవడతో వచ్చేంత మృదుత్వం ఈ పరికరంతో రాలేదు. నేతన్నల చేతులకు గాయాలవ్వడం.. ఇతర అంశాల కారణంగా ఆ పరికరం వినియోగంలోకి రాలేదు.
- అయినా సీనియర్ సైంటిస్ట్ మహేష్ కుమార్ ప్రత్యామ్నాయాలపై పట్టువిడవలేదు. చేప దవడ మాదిరిగానే ఉండేలా సన్నని ప్లాస్టిక్ సూదుల్ని స్విట్జర్లాండ్‌లో, దవడ భాగాన్ని థాయ్‌లాండ్‌లో రూపొందించి మరో కొత్త పరికరాన్ని రూపొందించారు. కానీ ఈ పరికరం ఖర్చు ఎక్కువగా ఉండడంతో.. ఖాదీ కమిషన్ ఆఫ్ ఇండియా అనుమతి కోసం పంపించారు.

- విదేశీ సాంకేతికతతో తయారు చేసిన ప్రత్యామ్నాయ పరికరం ఖరీదు రూ.750 వరకు ఉంది.
- అదే వాలుగ చేప దవడ అయితే కేవలం రూ.25 నుంచి రూ.50 వరకు ఉంది.

- జిల్లాకు చెందిన పాగిరి జశ్వంత్‌నాయుడు (చెన్నై ట్రిపుల్ ఐటీ, ఐఐఎం అమృత్‌సర్ పూర్వ విద్యార్థి) బృందం కూడా ప్రత్యామ్నాయ పరికరంపై దృష్టిసారించింది. ఐఐఎం అమృత్‌సర్ వేదికగా ఐదుగురు సభ్యుల బృందం త్రీడీ టెక్నాలజీ సాయంతో మోడల్‌ను రూపొందించింది. ప్లాస్టిక్‌ది కావడం.. ఇతర అంశాల వల్ల ఇదీ సఫలీకృతం కాలేదు. ఈ బృందం మరిన్ని ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించింది.
- పొందూరుకు చెందిన ఆంధ్రప్రదేశ్ ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం(ఏఎఫ్‌కేకే) వాలుగ చేప సేకరణకోసం విస్తృతంగా ప్రయత్నిస్తోంది. వాలుగ సేకరణ కష్టంగా మారడంతో దానిని పోలి ఉండే మరో రకం చేపపై దృష్టిసారించారు. హిరమండలం రిజర్వాయర్‌లో వీటిని సేకరించేలా ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ దీని వినియోగంలో కూడా ఇబ్బందులు ఉన్నాయి. త్వరగా విరిగిపోవడం, అరిగిపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దీనిని వినియోగిస్తున్నారు.


వాలుగుకు ఏదీ సాటిరాదు..

పత్తిని శుభ్రం చేసేందుకు వాలుగ చేప దవడకు ప్రత్యామ్నాయం లేదనే చెబుతున్నారు నిపుణులు. ఆ సున్నితత్వం.. ఆ శ్వేతవర్ణం వాలుగుకు ఏదీ సాటిరాదంటున్నారు. విజయనగరం జిల్లా వంగర మండలం మడ్డువలస రిజర్వాయర్‌లో వాలుగ చేపలు ఉన్నాయని జీవవైవిధ్య పరిశోధకులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో వేట సాగించే మత్స్యకారులకు దీని వినియోగంపై విస్తృతమైన అవగాహన కల్పించి వారితో ఒప్పందం కుదుర్చుకుంటే మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా కూడా ఖాదీ బోర్డు ప్రయత్నాలు ప్రారంభించాల్సిన అవసరం ఉందంటున్నారు.



దారం తయారీకి సిద్ధమైన పత్తి

ఆ రిజర్వాయర్‌లో గుర్తించాం..



వాలుగ చేప శాస్త్రీయ నామం వల్లగో అట్టు. ఇది మంచి నీటి చేప. మా అధ్యయనాల్లో వాలుగు చేపలు మడ్డువలస రిజర్వాయర్‌లో విస్తృతంగా ఉన్నాయి. చాలా పెద్ద సైజుల్లోనే లభ్యమవుతున్నాయి.

–డాక్టర్ కర్రి రామారావు, జీవవైవిధ్య శాస్త్రవేత్త, డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విశాఖపట్నం

కొరత వాస్తవమే..



పొందూరు ఖాదీకి కీలకమైన వాలుగ చేప దవడ కొరత వాస్తవమే. చాలా మంది ప్రత్యామ్నాయాల వేటలో ఉన్నారు. కానీ అవి సఫలీకృతం కాలేదు. మా వంతుగా ఇటీవలే హిరమండలం రిజర్వాయర్‌లో వేరే రకం చేపను వినియోగించేందుకు ప్రయత్నాలు ప్రారంభించాం. వాలుగుకు ఏదీ సాటి రాదు.

–డి.వెంకటరమణ, సెక్రటరీ, ఏఎఫ్‌కేకే, పొందూరు

స్విట్జర్లాండ్‌లో తయారీ..



వాలుగ చేప దవడకు ప్రత్యామ్నాయంగా ఇప్పటికే ఒక పరికరాన్ని రూపొందించాం. కొన్ని ఇబ్బందులు గమనించాం. అందుకే విదేశీ పరిజ్ఞానంతో కొత్త ప్రాజెక్ట్ పూర్తి చేశాం. తలవెంట్రుకల పరిమాణంలో ఉండే సూదులను ప్లాస్టిక్ మెటీరియల్‌తో స్విట్జర్లాండ్‌లో రూపొందించాం. దవడ భాగాన్ని థాయ్‌లాండ్‌లో తయారు చేయించాం. పరికరం ఖరీదు కాస్త ఎక్కువ.

–మహేష్‌కుమార్, సీనియర్ సైంటిస్ట్, ఎంజీఐఆర్ఐ, వార్ధా, మహారాష్ట్ర

ప్రయత్నం చేస్తున్నాం..



పొందూరు ఖాదీలో కీలకమైన వాలుగ చేప దవడ భాగం సేకరణ కష్టతరం కావడంతో ప్రత్యామ్నాయాల దిశగా ఐఐఎం అమృత్‌సర్ వేదికగా మా టీమ్ దృష్టి సారించింది. ప్రొఫెసర్‌తో సహా ఐదుగురు సభ్యులు ఓ పరికరాన్ని రూపొందించాం. కొన్ని ఇబ్బందులు గమనించాం. పూర్తి పర్యావరణ హితమైన మెటీరియల్‌తో తయారు చేసేందుకు మా వంతు ప్రయత్నం మేం చేస్తున్నాం.

– పాగిరి జశ్వంత్ నాయుడు, స్ట్రాటజీ కన్సల్టెంట్, ఈవై

శిక్షణ తీసుకున్నాం..



కృత్రిమ చేప ముల్లుతో పత్తిని శుభ్రం చేసే ప్రక్రియను నేర్చుకునేందుకు హైదరాబాదుకు వెళ్లాం. దీని వినియోగంతో నాణ్యమైన 100 కౌంటు దారం రాదు. అందుకే దీనిని వినియోగించలేదు.

–కాపల కుమారి, చేనేత కార్మికురాలు


వసతి గృహ విద్యార్థులకు అస్వస్థత

- 39 మందికి వాంతులు, విరోచనాలు
- ఫుడ్ పాయిజనింగ్ కారణమన్న వైద్యులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

టెక్కలి రూరల్: మండలంలోని పోలవరం బీసీ బాలురు వసతి గృహం విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురై సోమవారం ఉదయం టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చేరారు. ఇక్కడ మొత్తం 88 మంది విద్యార్థులు ఉంటున్నారు. 5 నుంచి 9వ తరగతి చదువుతున్న 13 మంది విద్యార్థులు ఉదయం అల్పాహారం తిన్న తర్వాత కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలతో ఇబ్బంది పడటంతో వసతి గృహం వార్డెన్ టి.అప్పారావు హుటాహుటిన ఆటోలో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ కె.వినోద్‌కుమార్ విద్యార్థులను పరిశీలించి కలుషిత ఆహారం వల్లే అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. అనంతరం చికిత్స అందించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మితులసి ఆస్పత్రికి వచ్చి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం వసతి గృహానికి వెళ్లి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మిగిలిన విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇంతలో మరో 16 మంది విద్యార్థులు వాంతులు, విరోచనాలు, కడుపునొప్పితో బాధపడటంతో వారిని కూడా టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. రాత్రి 8.30 సమయంలో మరో 10 మంది విద్యార్థులు వాంతులు, విరోచనాలతో టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చేరారు. మొత్తం 39 మంది విద్యార్థులు ఆస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, టెక్కలి జెడ్పీటీసీ దువ్వాడ వాణి ఆరా తీశారు. ఎంపీడీఓ జి.ఉమాసుందరి, తహశీల్దార్ కిషోర్‌లు వైద్యులతో మాట్లాడారు. వసతి గృహంలో ఆదివారం మధ్యాహ్నం చికెన్‌తో అన్నం, రసం, రాత్రికి పప్పు అన్నం పెట్టారు. సెలవు కావడంతో కొంత మంది విద్యార్థులు వసతి గృహం సమీపంలోని మామిడి కాయలు, సీమచింత కాయలు తిన్నట్లు తెలిసిందే. అందుకే ఫుడ్ పాయిజనింగ్ జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.



వసతిగృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మితులసి

ఆందోళన వద్దు.. ఆరోగ్యంగానే ఉన్నారు

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వసతి గృహ విద్యార్థులు ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నారని, ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో విద్యార్థులు చికిత్స పొందుతున్నారని, మంగళవారం ఉదయం విద్యార్థులను తిరిగి వసతి గృహానికి పంపనున్నామని పేర్కొన్నారు

ఆకట్టుకున్న గణితాకృతి

పొందూరు మండలం తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ గణిత దినోత్సవం పురస్కరించుకుని సోమవారం విద్యార్థులు గణిత సంకేతమైన 'పై' ఆకారంలో ఏర్పడి ఆకట్టుకున్నారు. నిత్య జీవితంలో గణిత శాస్త్ర ఆవశ్యకతను ఉపాధ్యాయులు పూజారి హరిప్రసన్న, చౌదరి వేణుగోపాల్‌లు వివరించారు.

– పొందూరు



మూడు పూరిళ్లు దగ్ధం



వనుముపేటలో కాలిపోయిన పూరిళ్లు

గార: మండలంలోని శ్రీకూర్మం మేజర్ పంచాయతీలో వనుమువానిపేటలో సోమవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో మూడు పూరిళ్లు, ఆరు పశువుల శాలలు దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు వ్యాపించాయని బాధితులు చెబుతున్నారు. ఈ ఘటనలో వనుము నీలమ్మ, ఆవాల లక్ష్మీ, కుర్రు అప్పలరామయ్యలకు చెందిన మూడు పూరిల్లు, పిట్ల కుర్లోడు, రాజారావు, కుర్రు రాజప్పడు, కుర్రు సింహాచలం, వనుము దాలప్పడు, కుర్రు అప్పలరాజులకు చెందిన పశువుల శాలలు అగ్నికి ఆహుతయ్యాయి. రూ.లక్షా 50 వేలు నష్టం జరిగినట్టు రెవెన్యూ వర్గాలు ప్రాథమికంగా అంచనా వేశాయి. కుర్రు అప్పలరామయ్యకు చెందిన రూ.50 వేలు నగదు, వనుము నీలమ్మకు చెందిన రూ.25 వేలు, ఆవాల లక్ష్మీకి చెందిన రూ.10 వేలు నగదు, పావుతులం బంగారం అగ్నికి ఆహుతయ్యాయి. శ్రీకాకుళం నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. వీఆర్‌వోలు జగదీశ్వరరావు, రంగారావులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కంబకాయ, చెన్నాపురంలో..

నరసన్నపేట: మండలంలోని కంబకాయ, చెన్నాపురం గ్రామాల్లో సోమవారం అగ్ని ప్రమాదాలు సంభవించాయి. కంబకాయలో లబ్బ రాజారావు, రామారావులకు చెందిన మూడు గడ్డి కుప్పలు, 10 బస్తాల ధాన్యం బస్తాలు అగ్నికి ఆహుతయ్యాయి. రూ.40 వేల వరకూ ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేస్తున్నారు. చెన్నాపురం గ్రామంలో రావాడ సింహచలం, రావాడ సరస్వతమ్మలకు చెందిన గడ్డివాములు, పిట్ట సింహాచలం చెందిన గడ్డి వాము, పశువుల శాల దగ్ధమయ్యాయి. లక్ష రూపాయల వరకూ ఆస్తి నష్టం కలిగినట్లు సమాచారం. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.